www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 08 | డిసెంబర్ | 2025 పేజీలు : 6

## నేడు జిల్లాలో కూనంనేని పర్యటన



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనం నేని సాంబశివరావు సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన పలు గ్రామా ల్లో సిపిఐ బలపర్చిన అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ కూనంనేని సాంబశివరావు తో పాటు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు ప్రచార కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు చింతకాని మండలం బస్వాపురం, ఉదయం 9 గంటలకు నేరడ, ఉదయం 11.30కు మధిర మండలం మల్లవరం, మధ్యాహ్నం 12.30కు కొండవనమాల, పెద్దమునగాల, చిన్నగోపతి గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు తనికెళ్ల, సాయంత్రం నాలుగు గంటలకు వివిపాలెం, సాయంత్రం ఐదు గంటలకు కోదుమూరు, సాయంత్రం ఆరు గంటలకు పంగిడిలో జరిగే ప్రచార కార్యక్రమంలో పాల్గొననున్నారు. సిపిఐ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కోరారు.

# ఊరుకో తీరు.. వార్డుకో రీతి..!

**-గెలుపే లక్ష్యంగా పొత్తులు, ఎత్తులు**
**-ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో అభ్యర్థులు**






**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఎన్నికలంటే సహజంగానే రాజకీయ పార్టీలు గుర్తుకొస్తాయి. రాజకీయ పార్టీలకు సంబంధించిన పార్టీల గుర్తులు ఉన్నా లేకపోయినా స్థానిక సంస్థల మొదలు ఏ ఎన్నికలైనా రాజకీయ పార్టీలే ఎన్నికలను నడిపిస్తుం టాయి. సహజంగానే భావసారూపత్యత కలిగిన పార్టీల మధ్య లేదా సైద్దాంతిక అవగాహనతో పని చేసే పార్టీల మధ్య పొత్తులు కుదుర్చుకోవడం సహజమే. కానీ ఈ దఫా జరుగుతున్న గ్రామ పంచాయతీ మిగతా 2లో..

## అవకాశవాద రాజకీయాలు చేస్తున్న వారికి బుద్ధి చెప్పాలి

**- సిపిఐ బలపరిచిన అభ్యర్ధులను గెలిపించండి - ఎంఎల్ఏ కూనంనేని - పలువురు సిపిఐలో చేరిక**



2 లో

## మల్లవరంలో హోరెత్తిన కాంగ్రెస్, సిపిఐ ప్రచారం



**-పాల్గొన్న మల్లు నందిని, బాగం హేమంతరావు**

2 లో

## డిజిటల్ ప్రచారంలో అభ్యర్థులు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాలం మారింది శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్ని రంగాల్లోనూ వినియోగించుకున్నట్లే పల్లె పోరులోనూ డిజిటల్ ప్రచారమే ముందు వరుసలో నిలిచింది. బరిలో నిలిచిన అభ్యర్థులు వారి మద్దతుదా రులు డిజిటల్ ప్రచారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తు న్నారు. ఎన్నికలు మొదలైన తొలి నాళ్లలో ఇంటింటికి

**-ఫోన్ ద్వారానే అన్ని**

తిరిగి ఓటు అడిగే వారు. పంచాయతీ ఎన్నికల్లోనైతే ఎంత మంది అభ్యర్థులు బరిలో ఉంటే అన్ని పోలింగ్ బాక్స్‌లను ఏర్పాటు చేసేవారు. ఎవరి మద్దతు దారులు ఆయా అభ్య ర్థుల బాక్స్‌ల్లో చిట్టీలు వేసే వారు. వాటిని లెక్కించి విజేతలను తేల్చేవారు. మిగతా 2లో..

# ఊరుకో తీరు.. వార్డుకో రీతి..!

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల్లో ఏ పార్టీ ఏ పార్టీతో కలిసి పని చేస్తుందో అర్థం కాని గందర గోళ పరిస్థితి నెలకొన్నది. ఊరుకో తీరుగా పొత్తులు కుదుర్చుకున్నారు. విపక్షం, అధికార పక్షం అనే తేడా లేకుండా పొత్తులు కుదుర్చుకుని పంచాయతీ ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. అధికార కాంగ్రెస్‌తో విపక్ష బిఆర్ఎస్ పలు పంచాయతీలలో జట్టు కట్టింది. ఇరువురు ఒప్పందం చేసుకుని నీకో పదవి నాకో పదవి అన్న రీతిలో పంచుకుంటున్నారు. అలాగే రాజకీయ పార్టీలకు అతీతంగా అభ్యర్థులను బరిలో దింపుతున్నారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో అన్ని రాజకీయ పార్టీలు ఏకమై స్వతంత్ర అభ్యర్థుల మీద ఉమ్మడి అభ్యర్థిని పెట్టిన పరిస్థితులు కూడా నెలకొన్నాయి. కమ్యూనిస్టులంటే ఆమడ దూరంలో ఉండే బిజెపి కూడా పలు చోట్ల వామపక్షాల అభ్యర్థులకు మద్దతునిస్తుండటం గమనార్హం. కాంగ్రెస్‌తో టిడిపి, కాంగ్రెస్‌తో బిఆర్ఎస్, సిపిఐతో సిపిఎం, సిపిఐతో బిఆర్ఎస్, బిఆర్ఎస్‌తో టిడిపి, వామపక్షాలతో బిఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఇలా సిద్ధాంతాన్ని పక్కన పెట్టి పంచాయతీలలో గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నాయి. అభ్యర్థుల ప్రచారంలో కొన్ని గ్రామాల్లో అన్ని పార్టీల జెండాలను ప్రదర్శిస్తూ ఆశ్చర్య చకితులను చేస్తున్నారు. ఎవరితో ఎవరు కలిసిన గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్న ఉమ్మడి లక్ష్యంతో గ్రామ పంచాయతీల్లో రాజకీయం వేడెక్కింది. ఇప్పటికే ఇంటింటికి వెళ్లి ప్రతి ఓటరుకు బరిలో నిలిచిన అభ్యర్థులు గుర్తులను చేరవేశారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పలు మార్గాలను అన్వేషిస్తున్నారు. ముఖ్యంగా మద్యం పంపిణీ జోరుగా సాగుతుంది. నామినేషన్ల పర్వం నుంచి ప్రారంభమైన మందు పంపిణీ ఎన్నికలు పూర్తయ్యే వరకు కొనసాగించక తప్పదని అభ్యర్థులు వాపోతున్నారు. శాసనసభ ఎన్నికల్లో



నిలబడిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇంటింటికి తిరిగి నగదు పంపిణీ చేయడంతో ఇప్పుడు కూడా ఓటుకు ఖరీదు కడితేనే పోలింగ్‌కు వచ్చే పరిస్థితి ఏర్పడింది. దీనితో బరిలో నిలిచిన అభ్యర్థులు తల తాకట్టు పెట్టయినా ఖర్చు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. చిన్న చిన్న గ్రామాల్లో సైతం ఐదు నుంచి పది లక్షలు ఖర్చు చేస్తుండగా కొన్ని గ్రామ పంచాయతీల్లో ఇరు పక్షాల అభ్యర్థుల ఖర్చు కోటి రూపాయల పైమాటేనని జనరల్, బిసి స్థానాలతో పాటు ఈ దఫా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రిజర్వుడ్ స్థానాల్లోనూ పెద్ద మొత్తంలోనే ఖర్చు చేస్తుండటం గమనార్హం. ఓటుకు రూ. 500 నుంచి రూ. 10వేల వరకు పంపిణీ చేసే గ్రామ పంచాయతీలు ఉండవచ్చునని అంచనాలు వేస్తున్నారు. మొత్తంగా సిద్ధాంత రాద్ధాంతాలను పక్కన పెట్టి రాజకీయ వైరాలను మరిచిపోయి చిత్ర విచిత్ర శిబిరాలు. కూటములతో పంచాయతీల్లో గెలుపొందెందుకు సర్వం ఒడ్డుతున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు సామ బేద దండోపాయాలతో పాటు ధనాన్ని ప్రముఖంగా వినియోగిస్తున్నారు.

# డిజిటల్ ప్రచారంలో అభ్యర్థులు

(మొదటిపేజీ తరువాయి)



ఆ తర్వాత గుర్తులు వచ్చాయి. గుర్తులను తెలియజేస్తూ గోడల మీద రాసేవారు. తర్వాత కాలంలో గోడ పత్రాలతో గుర్తులు, వివరాలను తెలియజేస్తూ ఇంటింటికి తిరిగి అంటించే వారు. గత పంచాయతీ ఎన్నికల వరకు ఇదే తంతు నడిచిన ప్రస్తుతం మాత్రం డిజిటల్ ప్రచారంతో బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రచారం సాగిస్తున్నారు. దశాబ్ద కాలంలో సెల్ ఫోన్ వినియోగం విపరీతంగా పెరిగింది. కుటుంబంలో ఎంత మంది సభ్యులుంటే దాదాపు మేజర్లందరికీ మనిషికో సెల్‌ఫోన్ ఉంది. వినియోగించే ఫోన్లలో 90 శాతానికి పైగా ఆండ్రాయిడ్ ఫోన్లను ఉపయోగించడంతో పాటు వాట్సాప్, ఫేస్‌బుక్‌లను వాడుతున్నారు. ఇప్పుడు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బరిలో నిలిచిన అభ్యర్థులు ఆయా గ్రామ పంచాయతీల్లోని ఓటర్ల సెల్ ఫోన్ నెంబర్లను సేకరించి గ్రూపులుగా ఏర్పాటు చేసి గంటకో మారు సమాచారాన్ని పంపిస్తున్నారు. సర్పంచ్ అభ్యర్థి వివరాలు, ఎన్నికల గుర్తును ఫోన్ ద్వారా ఓటర్లకు చేరవేయడంతో పాటు ఓటర్లను అభ్యర్థిస్తూ వాయిస్ మేసేజ్‌లను పంపుతున్నారు. గెలిపిస్తే గ్రామంలో తాము చేపట్టబోయే పనుల వివరాలను సెల్‌ఫోన్‌లోనే ఏకరువు పెడుతున్నారు. వార్డు అభ్యర్థులుగా నిలిచిన వారు సైతం ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు. ఎన్నికల గుర్తును ఓటరుకు చేరవేసేందుకు అతి సునాయాస మార్గంగా ఇప్పుడు డిజిటల్ ప్రచారం వెలుగులోకి




వచ్చింది. గుర్తులు, అభ్యర్థుల వివరాలతో పాటు తాము గతంలో చేసిన పనులు, చేపట్టబోయే పనులు, పార్టీ నేతల సహచర్యం తదితర విషయాలతో పొందుపర్చిన వీడియోలకు అద్భుతమైన పాటలను సెట్ చేసి జనంలోకి వదులుతున్నారు. అన్నింటికి మించి ఎన్నికలంటే ఇప్పుడు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు తులమో ఫలమో అప్పగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదివరకు క్వార్టర్ మందు మొదలు నగదు అడగాలన్న బరిలో నిలిచిన అభ్యర్థి ఇంటి ముందు పడాగాపులు కాయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ అవసరం లేదు మద్యానికైనా లేదా నగదు ఇచ్చేందుకైనా డిజిటల్ చెల్లింపులు జరిగిపో తున్నాయి. మొత్తానికి ఖర్చు చేసే మొత్తం పెరిగినా డిజిటల్ యుగంలో ప్రచారం సులువైందని అభ్యర్థులు పేర్కొనడం విశేషం.

# మల్లవరంలో హోరెత్తిన కాంగ్రెస్, సిపిఐ ప్రచారం



**ప్రజాపక్షం/ఖమ్మం/మధిర :** మధిర మండలం మల్లవరం గ్రామంలో ఆదివారం సిపిఐ, కాంగ్రెస్ నేతలు ప్రచారాన్ని హోరెత్తించారు. కాంగ్రెస్ బలపర్చిన సిపిఐ సర్పంచ్ అభ్యర్థి మందడపు రాణి విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు మల్లు నందిని, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మందడపు రాణిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మల్లు నందిని మాట్లాడుతూ దశాబ్ద కాలంగా మల్లవరం గ్రామం అభివృద్ధిలో పూర్తిగా వెనకబడి పోయిందని ఆమె తెలిపారు. అధికార పార్టీ బలపర్చిన సిపిఐ అభ్యర్థిని గెలిపిస్తే ప్రభుత్వం నుండి అన్ని రకాల సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన అందరికీ అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. మల్లవరం గ్రామాభివృద్ధి బాధ్యత తను, సంక్షేమ కార్యక్రమాల అమలును తాను స్వయంగా పర్యవేక్షిస్తానని సిపిఐ అభ్యర్థిని మంచి మెజార్టీతో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గ్రామానికి సంబంధించి కానీ సంక్షేమ కార్యక్రమాల అమలుకు సంబంధించి కానీ తమను నేరుగా కలవచ్చునని ఆమె తెలిపారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేసే మందడపు రాణిని సిపిఐ వార్డు సభ్యులను గెలిపించాలన్నారు. కాంగ్రెస్, సిపిఐ ఐక్యంగా పనిచేస్తూ ముందుకు సాగుతున్నాయని దాదాపు గెలుపు ఖాయమైందని మెజార్టీ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. మరో మూడు రోజులు అవిశ్రాంతంగా పని చేయాలని ఆయన కాంగ్రెస్, సిపిఐ కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు కె.రాంబాబు, దుర్గాభవాని, సిపిఐ, కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.

## అవకాశవాద రాజకీయాలు
# చేస్తున్న వారికి బుద్ధి చెప్పాలి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పార్టీలకు అతీతంగా పేదలకు అభివృద్ధి ఫలాలు అందించేందుకు గత రెండేళ్లుగా అహర్నిశలు కృషి చేస్తున్నామని, అవకాశవాద రాజకీయాలు చేస్తూ ఓట్ల కోసం ఇళ్ల ముందుకు వచ్చే వారికి తగిన బుద్ధి చెప్పాలని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. లక్ష్మీ దేవిపల్లి మండల పరిధిలోని చాతకొండ, హమాలీ కాలనీ, ప్రశాంత్ నగర్, లక్ష్మీ దేవిపల్లి, లోతువాగు, సంజయ్ నగర్, సాటివారిగూడెం గ్రామాల్లో సిపిఐ పార్టీ బలపరిచిన సరపచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయా గ్రామాల్లో ముఖ్యనేతలకు సూచించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కష్టకాలంలో ప్రజలు సిపిఐని ఆదరించారని, అలాంటి సందర్భంలో కొందరు చేస్తున్న అవకాశవాద రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, నియోజకవర్గాభివృద్ధే ధ్యేయంగా పార్టీలకు అతీతంగా పేదలకు, అండగా రెండేళ్లుగా చేస్తున్న పనులు గమనించి స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను ఎన్నుకోవాలని పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి సిపిఐ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని, అభివృద్ధికి పట్టం కట్టడానికి ప్రజలు సైతం ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, మండల ముఖ్యనాయకులు, పంచాయితీ బరిలో ఉన్న సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, వారి మద్దతు దారులు, సిపిఐ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా
# బత్తినేని చారిటబుల్ ట్రస్టు వైద్య సేవలు



**ప్రజాపక్షం/ బోనకల్ :** విజయవంతంగా బత్తినేని చారిటబుల్ ట్రస్టు వైద్య సేవలు కొనసాగుతున్నాయని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. మండల కేంద్రంలో బత్తినేని చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో అమరజీవి తూము ప్రకాశ్‌రావు జ్ఞాపకార్థం బిపి, షుగర్, కంటి 63వ ప్రత్యేక వైద్య శిబిరం ఆదివారం విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు బత్తినేని చారిటబుల్ ట్రస్టు వైద్య సేవలు ఓ వరమని అన్నారు. మండల ప్రజలతో పాటు చుట్టూ పక్కల ప్రాంత ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యులు సిలివేరు సదానందం మాట్లాడుతూ రక్తపోటు అధికంగా ఉన్న వారు బరువు పెరుగుదలను నియంత్రించుకుంటూ క్రొవ్వు పద్దార్థాలు, వేపుళ్లు, కేకులు, జంక్ పుడ్స్‌కి చాలా వరకు దూరంగా ఉండాలన్నారు. ఉప్పు వాడకాన్ని తగ్గించాలని, వైద్యులు సూచించిన విధంగా ఆహార నియమాలు పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చునని తెలిపారు. ఈ క్యాంపు వైద్యులు సదానందం వైద్య సేవలు అందించగా బత్తినేని ట్రస్టు సభ్యులు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, ఆర్‌ఎంపి డబ్ల్యూ ఎటిఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు చేతుల మీదుగా పేషెంట్లకు మందలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఏలూరి పూర్ణచందు, మాతంగి శ్రీనివాసరావు, కొంగర కృష్ణయ్య, బోళ్ల ప్రసాద్‌రావు, సహాయకులు యంగల గిరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్స్ డివిజన్ అధ్యక్షుడిగా
## పసుపులేటి నాగేశ్వరరావు




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ప్రైవేట్ స్కూల్స్ సత్తుపల్లి డివిజన్ అధ్యక్షుడిగా విశ్వశాంతి విద్యాలయం కరస్పాండెంట్ పసుపులేటి నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఆదివారం స్థానిక స్వామి వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్సీ భవనంలో నిర్వహించిన ఎన్నికల్లో ఈ మేరకు నాగేశ్వరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పాలకొల్లు శ్రీనివాసరావు, గొబ్బూరి నాగరాజు, కార్యదర్శిగా ఈశ్వర్, కోశాధికారిగా చీకటి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా జుజ్జురి చెన్నారావు, ఎదుళ్ల మురళీకృష్ణ, గౌరవ అధ్యక్షులుగా లక్కినేని ప్రసాద్, గౌరవ సలహాదారులుగా మందపాటి ప్రభాకర్ రెడ్డి, కృష్ణారావు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి నాయుడు వెంకటేశ్వరరావు, రాష్ట్ర బాధ్యులు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# వివి పాలెంలో త్రిముఖ పోటీ

**-గెలుపులో జగ్యాతండా కీలకం**







**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మండల పరిధిలోని వి. వెంకటాయ పాలెం గ్రామంలో త్రిముఖ పోటీ నెల కొంది. సిపిఐ, కాంగ్రెస్ ల మధ్య హోరా హోరిగా పోరు కొనసాగుతుండగా బిఆ ర్ఎస్ కూడా పోటీనిస్తుంది. ఇది బిఆర్ ఎస్ చివరి వరకు పోటీలో ఉంటుందా లేదా అన్న సందిగ్ధం ఓటర్ల మదిలో నెల కొంది. సర్పంచ్ స్థానానికి సిపిఐ, కాంగ్రెస్, బిఆర్ఎస్ తరుపున పోటీ పడుతున్నారు. సిపిఐ నుంచి శాఖ మూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నుంచి కాపా ఆదినారాయణ, బిఆర్ ఎస్ నుంచి కుతుంబాక నరేష్ లు పోటీ పడుతుండగా 12 వార్డులకు మూడు పార్టీల తరుపున అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధానంగా సిపిఐ కాంగ్రెస్ ల మధ్య పోటీ ఉండగా బిఆర్ఎస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థి కూడా గట్టి పోటీ ఇస్తున్నారు. ముగ్గురు అభ్యర్థులు గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సిపిఐ అభ్యర్థి శాఖ మూరి శ్రీనివాసరావు గత ఐదేండ్లు సిపిఐ పాలనలో గ్రామంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ గెలిపిస్తే చేపట్టనున్న పనులను వివరిస్తూ సుపరిపా లనకు ఓటేసి గెలిపించాలని ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న కాపా ఆదినారాయణ గతంలో తాను సర్పంచ్‌గా ఉన్న ప్పుడు చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఇప్పుడు గెలిపిస్తే ఎలాంటి అభివృద్ధి చేపడతానో ప్రచారంలో వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. బిఆర్ఎస్ తరుపున పోటీ చేస్తున్న కుతుంబాక నరేష్ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ప్రచారం నిర్వహి స్తున్నారు. గ్రామంలో మొత్తం 3,570 ఓట్లు ఉన్నాయి. అందులో జగ్యా తండాలో నాలుగు వార్డుల పరిధిలో సుమారు 1200 ఓట్లు ఉన్నట్లు సమాచారం. గ్రామంలో పాతూరు, కొత్తపేట లో సిపిఐ, కాంగ్రెస్ తరు పున పోటీ చేస్తున్న అభ్యర్థులు సమానంగా ఓట్లు పడతాయన్న చర్చ నడుస్తుంది. జగ్యాతండాలో 1200 ఓట్లు ఉండగా అక్కడ ఎవరు ఎక్కువ ఓట్లు తెచ్చుకుంటే గెలుపు వారిదేనన్న చర్చ జోరుగా సాగుతుంది. ఇదే క్రమంలో బిఆర్ఎస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థి కూడా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తుండగా ఇది పోలింగ్ వరకు ఉంటుందా అన్న చర్చ సాగుతుంది. పోలింగ్ సమయానికి బిఆర్ఎస్ తమ ఓట్లను తమకు అనుకూలంగా వేసుకుంటుందా లేదా ఇతరులకు బదలాయిస్తారా అన్న చర్చ కూడా గ్రామంలో జోరుగా సాగుతుంది. ప్రధానంగా సిపిఐ, కాంగ్రెస్ పార్టీ ల మధ్య హోరాహోరీ పోరు సాగుతుండగా సిపిఐకి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. చివరి రెండు రోజులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడం కూడా అభ్యర్థుల గెలుపుకు ముఖ్యం కానుంది. అదేవిధంగా గ్రామంలో ఓట్లు ఉండి ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారికి అభ్యర్థులు ఫోన్ చేసి ఓట్లు వేసేందుకు రావాలని ఫోన్లలో సంప్రదింపులు జరుపుతున్నారు.

# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

**- బిఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ కళ్లెం వెంకట్‌రెడ్డి**
**- జోరుగా గోళ్లపాడు సర్పంచ్ అభ్యర్థిని శ్రావణి ప్రచారం**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** గుండు శ్రావణిశ్రీనివాస్ ఉంగరం గుర్తుపై ఓటు వేసి అభివృద్ధి సంక్షేమాన్ని ఆశీర్వదించాలని, బిఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ కళ్లెం వెంకట్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చా రు. ఆదివారం ఖమ్మంరూరల్ మండలం గోళ్లపాడులోని ఊటవాగుతం డలో సర్పంచ్ అభ్యర్థి గెలుపుపై ముమ్మర ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి తండవాసులతో మాట్లాడి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్‌గా శ్రావణిని ఆశీర్వదిస్తే, మీరు చెప్పిన సమస్యలన్ని పూర్తి చేపించే భాద్యతనాదేనన్నారు. చెప్పుకుంటున్నని కాదు కానీ ఈ ప్రాంతంలో ఎటువంటి హామీలు ఇవ్వని, పనులతో పాటు అనేక అభివృద్ధి, సంక్షేమపథకాలను అమలు చేసినట్లు వివరిం చారు. ప్రజల తలలో నాలుకలా పిలిస్తే పలికే సర్పంచ్ అభ్యర్థినికి పట్టం కట్టాలన్నారు. ప్రధానంగా డ్రైనేజీలు, సీసీరోడ్లు, పొలాల, గ్రామాలలోకి వెళ్లే లింక్‌రోడ్లను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. అలాగే 10వ వార్డు మెంబర్ వెలుతూరి సతీష్ గ్యాస్ పోయి గుర్తుపై ఓటు వేసి ఆశీర్వ దించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోళ్లపాడు గ్రామశాఖ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు స్వెట్టర్లు అందజేసిన పోలీసులు

**పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన పారిశుద్ధ్య కార్మికులు**







**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో పనిచేస్తున్న 40 మంది పారి శుద్ధ్య కార్మికులు తెల్లవారుజామున చలి తీవ్రతకు తట్టుకోలేక తల్లిలోనే పనిచేసుప్తున్న తీరును చూసిన వైరా ఎస్సై పుప్పాల రామారావు ఆది వారం పారిశుద్ధ్య కార్మికులకు వైరా పోలీస్‌స్టేషన్ నందు పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వెట్టర్లు, రెండవ ఎస్సై పవన్‌తో కలిసి పారిశుద్ధ్య కార్మికులకు స్వెట్టర్లు అందజేశారు. ఈ సందర్భంగా వైరా ఎస్సై పుప్పాల రామారావు మాట్లాడుతూ చలి తీవ్రత పెరగడంతో చలికి గజగజ వణుకుతూ సూర్యుడు ఉదయించే వరకు ప్రజలు ఇంట్లో నుండి బయటకు అడుగు పెట్టడానికి భయపడుతున్నారు. కాని మున్సిపాలి టీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు తెల్లవారుజామున 4 గంటలు నుంచి రహదారులను శుభ్రపరుస్తూ చెత్తను పదార్ధాలను తరలించి శుభ్రతకు పునాది వేస్తున్న వారికి ప్రతిఒక్కరూ అండగా ఉండాలని వారి కష్టాల్లో పాల్పంచుకోవాలని వారికి చేయూతను అందించాలని పారి శుద్ధ్య కార్మికులను మనందరం పూజించాల్సిన విషయమని ఆయన అన్నారు. చలి తీవ్రత దృష్ట్యా నూలు స్వెట్టర్లు అందించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు ఎస్సై రామారావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ శానిటేషన్ అధి కారి వీరన్న, వెంకట్రావు, నాగరాజు, పోలీస్ సిబ్బంది నర్సింహారావు, చంద్రశేఖర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## జవ్వాజి అశ్విని గెలిపించండి : ఎమ్మెల్యే





**ప్రజాపక్షం/వైరా:** తాటిపూడి కాంగ్రెస్ పార్టీ గ్రామ సర్పంచ్ అభ్యర్థిని జవ్వాజి అశ్వినిని విజ యాన్ని కాంక్షిస్తూ ఆదివారం వైరా ఎమ్మెల్యే మాలతు రాందాస్‌నాయక్ తాటిపూడి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ విద్యావం తురాలు అయిన అశ్విని గెలిపించండి, గ్రామ అభివృద్ధికి పట్టం కట్టండి అని ఆయన అన్నారు. జవ్వాజి నాగరాజు, అశ్విని దంపతులు యువకులు ఉత్సాహవంతులు నిరంతరం ప్రజా సమ స్యల కోసం పోరాడతారని మీ గ్రామంలోని ప్రతి సమస్యను వారు పరిష్కరించే విధంగా కృషి చేస్తారని, మీరు జవ్వాజి అశ్విని ఉంగరం గుర్తుకి ఓటు వేసి గెలిపిస్తే అశ్విని గెలుపు అభివృద్ధికి మలుపుగా మారుతుందని గ్రామ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, జవ్వాజి కృష్ణయ్య, తాతా నిర్మల, పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు, వస్తువులు పంపిణీ




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** సన్‌రైజ్ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు, వస్తువులు పంపిణీ చేశారు. ఆదివారం మండల పరిధిలోని రఘునాథ పాలెం గ్రామంలో గల అంగన్ వాడీ కేంద్రానికి సన్‌రైజ్ అభ్యు దయ సేవా సమితి వైస్ ప్రెసి డెంట్ ఏనుగు శివరాఘవ మాతృ మూర్తి భవాని జ్ఞాపకార్థం అంగ న్‌వాడీ కేంద్రానికి కుర్చీలు, చాపలు, కూలింగ్ వాటర్ క్యాన్, రైస్ కుక్కర్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ బాధ్యులు మాట్లాడుతూ సన్‌రైజ్ సంస్థ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో అవస రమైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సన్‌రైజ్ సేవా సంస్థ బాధ్యులకు అంగన్‌వాడీ టీచర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ మాలతి దాస్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు సుమన్‌బాబు, ఏనుగు కిరణ్‌బాబు, అంగన్‌వాడీ టీచర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసు నమోదు

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పాత ఎర్రబోయినపల్లి గ్రామంలో ఓ వ్యక్తిపై హత్యయత్నం కేసు నమోదు అయినట్లు ఎస్సై హరిత తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ప్రకారం... మండల పరిధిలోని పాత ఎర్ర బోయినపల్లి గ్రామానికి చెందిన నల్లగట్ల అనిల్ పై పాత గొడవలు నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన కొంగల నాగరాజు అను వ్యక్తి బీరు సీసా తో పొడిచి హత్య ప్రయత్నం జరిగిందని బాధితుల తండ్రి నల్లగట్ల తిరపయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని ఎస్ఐ హరిత పేర్కొన్నారు.

## కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిని గెలిపించండి



**ప్రజాపక్షం/కల్లూరు:** కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపిం చాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి గ్రామపంచా యతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పేరు వంచలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన సభ్యురాలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అర్హులం దరికీ అందుతున్నాయని 17వ తేదీన జరగబోయే గ్రామ పంచా యతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ , వార్డు అభ్యర్థులను గెలిపించి పట్టం కట్టా లని ప్రజలను కోరారు. గ్రామంలో కుక్కలు, కోతులు బెడద నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుం టామని పేర్కొన్నారు. పేరు వంచ గ్రామంలో సిసి రోడ్లు, వడ్డీ లేని రుణాలు ప్రమాద బీమా రేషన్ కార్డులు సన్నబియ్యం సన్నధాన్యానికి బోనస్ ఇందిరమ్మ ఇండ్లు అనేక రకాల సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయని ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆ విధంగా రాబోయే రోజుల్లో ఇంకా పథకాలను అందజేస్తామని పేర్కొన్నారు. కనుక గ్రామపంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ బలపరిచిన వ్యక్తులను గెలిపించినట్లయితే గ్రామాలను అభివృద్ధి పథంలో ముందు ఉంచుతా మని పేర్కొన్నారు. పేరువంచ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి మధుసూదన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ తోపాటు మండల నాయకులు పసుమర్తి చందర్‌రావు, గ్రామ మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏకగ్రీవ సర్పంచుల ప్రమాణాస్వీకారం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పంచాయతీ ఎన్నికలలో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులు ఆదివారం ప్రమాణాస్వీకారం చేయించారు. మండలం లోని ఆచార్లగూడెం పంచాయతీలో ఆదివారం ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. తొలుత ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.నాగేశ్వరరావు సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. పంచాయతీ వార్డు సభ్యుడు ఆనం బస్విరెడ్డి నామినేషన్ వేశారు. 4వ వార్డు సభ్యుడు పులిమి వీరారెడ్డి ప్రతిపాధించారు. 7వ వార్డు సభ్యుడు గోళ్ల హనుమంత్ బలపరిచారు. దీంతో ఉప సర్పంచ్ గా ఎన్నికయ్యారు. సర్పంచ్ ఉప్పలమ్మ తో పాటు, సభ్యులు కూడ ప్రమాణాస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో అమరబోయిన బిక్షం, మార్తి గురవయ్య, సైదులు, రామయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఆజయతండాఉప సర్పంచ్ ఎన్నిక కు కోరం లేక వాయిదా పడింది. సర్పంచ్ తేజావత్ శివాజీ ప్రమాణాస్వీకారం చేశారు. కట్టుకాచారం లో ఉప సర్పంచ్ గా నెల్లూరి మోహాన రావు ను ఎన్నుకున్నారు. సర్పంచ్ బాణావత్ సైదులు ప్రమాణాస్వీకారం చేశారు.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్షల ఫీజు సకాలంలో చెల్లించాలి

### ఈ నెల 27 వరకు చివరి గడువు

**ప్రజాపక్షం/పాల్వంచ :** బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటి సెమిస్టర్ పరీక్షల ఫీజు సకాలంలో చెల్లించాలని ఈ నెల 27 చివరి తేదీ అని పాల్వంచ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోలారపు పద్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల లెర్నింగ్ సెంటర్ లో డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం మూడవ సెమిస్టర్, తృతీయ సంవత్సరం ఐదవ సెమిస్టర్ లకు గాను ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, పరీక్ష ఫీజులను ఈ నెల 27వరకు చెల్లించాలని అన్నారు. లేదా 500 ఫైన్‌తో జనవరి రెండు వరకు, రూ. 1000/లతో జనవరి ఏడు వరకు చెల్లించడానికి అవకాశం ఉందన్నారు. పరీక్షలు ఫిభ్రవరి 7వ, తేదీ నుండి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

## కోతుల సమస్యను పరిష్కరిస్తా

### -మొండికుంట సర్పంచ్ అభ్యర్థి మర్రి సంధ్య హామీ



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మొండికుంట గ్రామంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య కోతుల బెడదని సర్పంచిగా మీ యొక్క అమూల్యమైన ఓటు వేసి నన్ను గెలిపిస్తే గెలిచిన వెంటనే మొదటి సమస్యగా కోతుల బెడదను నిర్మూలిస్తానని బిఆర్ఎస్ బలపరిచిన మొండికుంట సర్పంచ్ అభ్యర్థి మర్రి సంధ్య అన్నారు. మొండికుంట ప్రజలకు ఆమె మొదటి సమస్యగా హామీ ఇస్తూ మన మొండికుంట గ్రామంలో రోజు రోజుకు పెరుగుతున్న కోతుల బెడదను తగ్గించేందుకు గతంలో నా భర్త మొండికుంట మాజీ సర్పంచ్ మల్లారెడ్డి పాలనలో కోతులు యొక్క సమస్యలు ఎదుర్కొనటానికి చాలా రకాలైన పరిష్కారాలను వెతకి కొంత వరకు ఫలితం వచ్చిన కోతులు మర ఇండ్లలోకి వచ్చి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, కానీ వాటి యొక్క నిర్మూలన పంచాయితీ స్థాయిలో శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని అటవీ శాఖతో సమన్వయం చేసి కోతుల్ని సురక్షిత ప్రదేశాలకు తరలించే చర్యలు, గ్రామంలో రోగనిరోధక వ్యర్థ నిర్వహణ, పంటలకు నష్టం జరగకుండా రైతులకు సహాయక పథకాలు, శాశ్వత పరిష్కారానికి శాస్త్రీయ పద్ధతుల్లో నివారణ చర్యలు చేపడతానని, గ్రామ ప్రజల భద్రత, పంటల రక్షణ, శాంతియుత వాతావరణం కల్పించడమే ప్రాధాన్యత అని గ్రామ ప్రజలైన మీరు నన్ను ఆశీర్వదించి మీ అమూల్యమైన ఓటు సీరియర్ నెంబర్ 4 లోని ఫుట్ బాల్‌పై వేసి గెలిపించాలని గడపగడపకు ప్రచారం చేశారు.

## సమితి సింగారం గ్రామపంచాయతీలో బిఆర్ఎస్ ప్రచార వాహనంపై దాడి

### -తీవ్రంగా ఖండించిన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మేజర్ సమితి సింగారం గ్రామపంచాయతీలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుండి గౌరీ ఎన్నికల ప్రచార వాహనంపై కాంగ్రెస్ పార్టీకి చెందిన గుండాలు దాడి చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ ఘటనలో ప్రచార వాహనం డ్రైవర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి భయాందోళనకు గురి చేసినట్లు సమాచారం. ఈ దాడిని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తీవ్రంగా ఖండించారు. ఎన్నికల నిబంధనలను స్పష్టంగా ఉల్లంఘిస్తూ, ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికలను అడ్డుకునేలా కాంగ్రెస్ పార్టీకి చెందిన గుండాలు వ్యవహరించడం అత్యంత దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. ప్రజాభిప్రాయం బీఆర్ఎస్ పార్టీ వైపున ఉందని గ్రహించి ప్రత్యర్థులు ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని రేగా కాంతారావు ఆరోపించారు. ఈ ఘటనపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఎన్నికల అధికారులను, పోలీస్ శాఖను ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ శాంతియుతంగా, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తోందని, ప్రజల మద్దతుతోనే విజయాన్ని సాధిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి బెదిరింపులు, దాడులతో బీఆర్ఎస్ పార్టీని అడ్డుకోవడం ఎవరి వల్ల కాదని ఆయన హెచ్చరించారు.

# తమ్ముడూ.. తప్పుకో..!

**-కొనసాగుతున్న బుజ్జగింపుల పర్వం**
**-తప్పుకుందామా..? పోటీలో ఉందామా..?**
**-కాంగ్రెస్ బుజ్జగింపులకు డైలమాలో అభ్యర్థులు**



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** సర్పంచ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ శుక్రవారం ముగిసింది. నామినేషన్ ఉపసంహరణ మంగళవారం ఉండటంతో కాంగ్రెస్ నాయకుల బుజ్జగింపుల పర్వానికి లక్షణంగా తెర లేపారు కొందరు అభ్యర్థులు, నాయకులు. ఈ నేపథ్యంలో నామినేషన్ వేసిన వారిలో కొందరు అభ్యర్థులు పోటీలో ఉందామా? తప్పుకుందామా? అనే డైలమాలో వున్నారు. పోటీ చేసిన వారి అభ్యర్థుల మద్దతుదారులతో చర్చలు చేపడుతున్నారు. మరోవైపు ఎలాగైనా సర్పంచ్ ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలని అభ్యర్థులు ఇప్పటికే అన్ని విధాలుగా సంసిద్ధులై ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల పర్వం ముగిసింది. ఇక గ్రామాల్లో అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంది. జూలూరుపాడు మండలంలో రాజకీయ వేడి రగులుతుంది. పంచాయతీ సర్పంచ్, వార్డ్ మెంబర్ల నామినేషన్ల పర్వం ముగియడంతో ఎన్నికల రాజకీయం కొత్త మలుపు తీసుకుంది. పోలింగ్‌కు ముందుగానే బరిలో నిలిచిన అభ్యర్థులను ఉపసంహరించుకోవాలని కోరుతూ ప్రధాన పార్టీల నాయకులు, స్థానిక పెద్దలు బుజ్జగింపుల పర్వాన్ని మొదలుపెట్టారు. ముఖ్యంగా తీవ్ర పోటీ ఉన్న స్థానాల్లో పట్టుదలకు పోయే అభ్యర్థులను ఒప్పించడం పై కాంగ్రెస్ నేతలు దృష్టి సారించారు.


**ఏకగ్రీవం పేరుతో బేరసారాలు..**

నామినేషన్ల స్క్రూట్నీ శనివారం ముగియడంతో పోటీగా నిలిచిన అభ్యర్థులతో నాయకులు రాయబారాలు, బేరసారాలు నడుపుతున్నారు. ముఖ్యంగా మండల కేంద్రంలోని వెంగన్నపాలెం మేజర్ పంచాయతీ ఏకగ్రీవం కోసం అధికార పార్టీలో మండల స్థాయి నాయకులు. నామినేషన్ ఉపసంహరణ కోసం పోటీలో వున్న వారికి నామినేటెడ్ డైరెక్టర్ల పదవులు ఆశ చూపుతున్నారు. ఆర్థికంగా బలంగా పోటీలో ఉన్న అభ్యర్థులు తెరవెనుక కొనుగోళ్లు ముమ్మరం చేస్తున్నారు. 9వ తారీకు మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ ఉండడంతో పోటీదారులను మచ్చిక చేసుకొని బరినుంచి తప్పించడానికి బలమైన అభ్యర్థులు, నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలోని పలు పంచాయతీలు ఏకగ్రీవం బాటలో చర్చలు సాగుతున్నాయి.

**మాట వింటేసరి లేకుంటే బెదిరింపులు...**

సర్పంచ్ అభ్యర్థులకు తల నొప్పి మొదలైంది. బరిలోనుంచి తప్పుకోవాలని, గ్రామాన్ని ఏకగ్రీవం చేయాలన్న బుజ్జగింపులు ఊరూరా కొనసాగుతున్నాయి. మాట వినని వారికి బెదిరింపులు తప్పడం లేదు. ఆర్థికంగా,అంగబలం ఉన్నవారు సర్పంచు పోటీదారులపై ఒత్తిడి తెస్తున్నారు. పోటీ నుంచి తప్పుకోవాలని, తాము చెప్పిన వారికి మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. మాట వినకపోతే హుకుం జారీ చేస్తున్నారు. దీంతో పోటీదారులు సతమతం అవుతున్నారు. ఇదీ వైరా నియోజకవర్గ పరిధిలోని జూలూరుపాడు మండలంలో జోరుగా సాగుతోంది. కాగా. జూలూరుపాడు మండలంలో సర్పంచు స్థానాలకు 124, వార్డు మెంబర్ స్థానాలకు 452 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో ఆశావహులతో పాటు, పలు రాజకీయ పార్టీల సీనియర్ నాయకులు ఉన్నారు. ఇందులో 9వ తారీకు మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు బరిలోనుంచి ఎంత మంది తప్పుకుంటారో మిగిలేది ఎందరో తేలనుంది.

## రాముల వారికి ఇప్పటికీ వనవాసం తప్పడం లేదు



**ప్రజాపక్షం/భద్రాచలం :** రాజకీయ రణరంగంలో రామయ్యకు నేటికి కూడా వనవాసం తప్పడం లేదని తెలంగాణ రాష్ట్ర బిజేపి అధికార ప్రతినిధి మాధవీ లత ఆరోపించారు. ఆదివారం స్థానిక గోదావరి ఇన్ ఫంక్షన్ హాల్లో బిజేపి బలపరిచిన టిడిపి, జనసేన మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా భరిలో ఉన్న హరిచంద్ర నాయక్ విజయాన్ని కాంక్షిస్తూ జరిగిన విలేకరుల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. గత బిఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం భద్రాచలాభివృద్ధిని గాలికి వదిలేశారని, ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో భద్రాచలం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, రాముని వారి తలంబ్రాలు తేవాల్సిన పెద్ద మనిషి ఒక్కటంటే ఒక్క సారి మాత్రమే తెచ్చి సాక్షాత్తూ శ్రీరామున్నే అవమానించారన్నారు. కేంద్ర విడుదల చేసిన గ్రామపంచాయితీల అభివృద్ధి నిధులను సక్రమంగా వినియోగించకుండా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. దేవాలయాలను అనుసందానం చేసే క్రమంలో బిజేపి ఒడిస్సా నుండి పాండురంగాపురం వరకు రైల్వే లైను నిర్మించేందుకు టెండర్లు పిలిచిందని చెప్పారు. కేంద్రంలో ఉన్న బిజేపి సర్కార్ శ్రీరాముడు నడయాడిని దక్షిణ అయోధ్య భద్రాచలాన్ని అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. కేంద్రం ద్వారా నిధులు తెప్పించే శక్తి ఉన్న బిజేపి బలపరచిన అభ్యర్థి హరిచంద్రనాయక్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కుంజా ధర్మారావు, కురిచేటి రామచంద్రమూర్తి, సర్పంచ్ అభ్యర్థి హరిచంద్రనాయక్, కొడాలి శ్రీనివాస్, కుంచాల రాజారామ్ పాల్గొన్నారు.

### ఎన్నికల వ్యయ నియమావళి

## కచ్చితంగా పాటించాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** గ్రామపంచాయితీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు ఎన్నికల వ్యయ నియమావళిని కచ్చితంగా అనుసరించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు లావణ్య అన్నారు. స్థానిక ఎన్నికలను పురస్కరించుకుని దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో నోడల్ ఆఫీసర్ ఎన్‌వి రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయా ఎంపిడిఓ కార్యాలయాలను సందర్శించి ప్రతీది కుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టిన ప్రతీ ఖర్చు పూర్తి లావాదేవీలతో తగిన ఆధారాలతో నమోదు చేయాలని, సమయానుసారంగా రిపోర్టులు సమర్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత అత్యంత ముఖ్యమని, ఏమైనా లోపాలుంటే తక్షణమే సరిదిద్దాలన్నారు. ఈ పర్యటనలో ఎన్నికల వ్యయబృంధాలు, సంబంధిత విభాగాధికారులు పాల్గొన్నారు.

## ఆక్రమిత స్థలం స్వాధీనం



**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి కేశవాపురం, బసవతారక కాలనీ గ్రామపంచాయితీ కార్యాలయాల నడుమ ఆక్రమిత స్థలాన్ని రెవిన్యూ అధికారులు గుర్తించారు. తహశీల్దార్ దారా ప్రసాద్ ఆదేశాలతో ఆదివారం ఆర్ఐ. నలీన్ కుమార్ ఆధ్వర్యంలో రెవిన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. సుమారు 167 అడుగులు, 10 అడుగుల వెడల్పు మేరకు ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకొన్నారు. అనంతరం ట్రంచ్ కొట్టారు. ఈ సంధర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమించటం చట్ట విరుద్ధమన్నారు. ఎవరైనా సరే చట్ట ప్రకారం వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేసే వారిని గెలిపించండి

**సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేసే వారిని సర్పంచ్ గా గెలిపించాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. మండలంలోని మోటాపురంలో కూటమి అభ్యర్థి ఏలూరి రామారావు విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల కోసం పాటుపడే కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. గ్రామాభివృద్ధి కావాలంటే మాయమాటలు నమ్మవద్దని సూచించారు. స్థానిక సంస్థల బలోపేతం కావాలంటే కూటమి నాయకులకు అధికారం కావాలని సూచించారు. ఇచ్చిన ప్రతీ హామీ ని అమలు చేసేందుకు కృషి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చావా కిరణ్, నున్నా రవికుమార్, బండి రమేష్ వెల్ల కృష్ణారావు, బెల్లం పుల్లయ్య, బెల్లం వాసు, తాల్లూరి నాగేశ్వరరావు, భాగం మురళీ, ఇంటూరి ఆశోక్, రంగారావు, గుగులోత్ వీరు, చావా రామయ్య, ఏలూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 50 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక

**-1975 టిటిసి బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం**



**ప్రజాపక్షం/ఖమ్మం :** వారంతా 50 సంవత్సరాల క్రితం ఒకేచోట శిక్షణ పొందారు. అంతేకాదు టీచర్ ట్రైనింగ్ సర్టిఫికేట్ (టిటిసి)కు సంబంధించి ఖమ్మం జిల్లాలో వారిదే మొదటి బ్యాచ్. వీరంతా ఉపాధ్యాయులుగానే కాకుండా ప్రభుత్వ రంగంలో వివిధ విభాగాలలో సుదీర్ఘ కాలం సేవలు అందించి పదవీ విరమణ చేసిన వారు. ఇన్ని సంవత్సరాల తర్వాత ఒక చోట కలుసుకోవడంతో ఆత్మీయ పలక రింపులతో ఒక ప్రత్యేక సందడి నెలకొన్నది. వివరాల్లోకి వెళితే.. 1975 1976లో మొదలైన టిటిసి శిక్షణ మొదలు కాగా తొలి బ్యాచ్ అపూర్వ కలయిక ఆదివారం ఖమ్మం నగరంలోని శుభవేళ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. అలపాటి అంకుప్రసాద్ ప్రత్యేక చొరవతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సుదీర్ఘ కాలం తర్వాత కలుసుకున్న మిత్రులు యోగక్షేమాలు, కుటుంబ వివరాలు, ప్రత్యేకించి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా హాజరైన మిత్రులందరికీ జ్ఞాపికలు అందించి ఘనంగా సన్మానించారు. ఇందులో కొందరు ఉపాధ్యాయ వృత్తితో ప్రారంభమై జాయింట్ కలెక్టర్ స్థాయికి ఎదిగిన వారు కూడా ఉండటం గమనార్హం. ఈ కార్యక్రమానికి అలపాటి అంకుప్రసాద్ అధ్యక్షత వహించగా నాటి టిటిసి బ్యాచ్ ప్రముఖులు బూర్లె లక్ష్మి నారాయణ, ఎస్. కామేశ్వరరావు, ఎ. రాఘవరావు, కనపర్తి వెంకటేశ్వర్లు, పి. కోటేశ్వర రావు, ఎ. రవీంద్రబాబు, ఫణీంద్రకుమారి, బద్రుద్దీన్, హెచ్‌వీఎల్ ప్రసాద్‌బాబు, ముదిగొండ శ్రీరామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

**ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్**





**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలో ఆదివారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ స్థానిక సంస్థల కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. తాటిపూడి, కొష్టాల, రెబ్బవరం, గొల్లపూడి, పాలడుగు, వల్లాపురం గ్రామాల్లో రాందాస్‌నాయక్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు. గత బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి ముందుకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వా ళ్ళ దుర్గాప్రసాద్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, దాసరి దానియేలు, మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఓట్ల దొంగలు వస్తారు జాగ్రత్త

**- బిఆర్ఎస్ సీనియర్ నేత రావులపల్లి**



**ప్రజాపక్షం/భద్రాచలం :** గ్రామ పంచాయితీ ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో కొందరు డబ్బుతో ఓటర్లను కొనేందుకు వెంపర్లాడుతున్నారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని బిఆర్ఎస్ సీనియర్ నేత రావులపల్లి రామ్ ప్రసాద్ అన్నారు. సిపిఎం, గోండ్వానా దండకారణ్య పార్టీ, ఆదివాసీ జేఏసి మద్దతిస్తున్న బిఆర్ఎస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి మానే రామకృష్ణ, వార్డు అభ్యర్థులు విజయాన్ని కాంక్షిస్తూ భద్రాచలం పట్టణంలోని 17,18,19 వార్డుల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జగదీష్ కాలనీలో జరిగిన సమావేశంలో రావులపల్లి ముఖ్యాతిధిగా హాజరై ప్రసగించారు. భద్రాచలం పట్టణానికి రామకృష్ణ సర్పంచ్‌గా ఉంటేనే శ్రీరామ కృష్ణ అని పేర్కొన్నారు. ఈ పట్టమాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామని వెల్లడించారు. ఇప్పటికే మానే విజయం ఖరారైందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఓటర్లు అంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం సర్పంచ్ అభ్యర్థి మానె రామకృష్ణ మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా అయ్యే అవకాశాన్ని తనకు ప్రజలు కల్పించాలని, ఈ ఎన్నికల్లో ఓటేసి ఆశీర్వదించాలన్నారు భద్రాచలం ప్రాంత అభివృద్ధికి ఇప్పటికే మ్యానిఫెస్టో తయారు చేయడం జరిగిందని, తమ కూటమి ఎంతో ఆలోచించి ఈ నిర్ణయాన్ని తీసుకుందన్నారు. సర్పంచ్ గా గెలిపిస్తే అభివృద్ధి చేసి తీరుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల కన్వీనర్ ఆకోజ్ సునీల్ కుమార్, 17వ వార్డు కూటమి అభ్యర్థి కణితి రాధ, 18వ వార్డు కూటమి అభ్యర్థి తెల్లం కామేశ్వరి, 19వ వార్డు కూటమి అభ్యర్థి మురాల శిరీష, ఆయా వార్డు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మానె గెలుపుని కాంక్షిస్తూ దళిత జేఏసి ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు.

## ప్రచారంలో దూసుకుపోతున్న సిపిఐ



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు, ఆళ్లపల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య ఆధ్వర్యంలో ఆళ్లపల్లి గ్రామ పంచాయితీ సిపిఐ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మెస్సు మమత విజయమే లక్ష్యంగా ఆళ్లపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఓటర్‌తో మమేకమై ఆప్యాయంగా పలకరిస్తూ వారి ఆశీర్వాదాలు తీసుకుంటూ తమకు ఓటు వేయమని మెస్సు మమత అడిగారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, ఆళ్లపల్లి గ్రామానికి చెందిన ఎస్కే సాబీర్ పాషా మన ఊరుకి చేస్తున్నటువంటి సేవలను ప్రజలకు రేసు ఎల్లయ్య గుర్తు చేశారు. అదే విధంగా సబ్బండ వర్గాలకు న్యాయం జరగాలన్న, సమ సమాజాన్ని స్థాపించాలన్న, సంక్షేమ ఫలాలు అందరికీ అందాలన్న సిపిఐ పార్టీ అధికారంలో ఉండాలని వారు ప్రజలకి ఈ సందర్భంగా తెలిపారు. వార్డు అభ్యర్థులు చింత సునీత, గౌరబోయిన సీత, గలిగ ప్రశాంతి, తాటి సంధ్యారాణి, కుంట సహదేవ్ వారి వార్డులలో ప్రజలను కలుస్తూ ఈ సందర్భంగా తమను గెలిపించాలమని కోరారు. ఈకార్యక్రమంలో ఆళ్లపల్లి మాజీ ఉపసర్పంచ్ గుంతోజు సదానంద చారి, మద్దెల వెంకటేశ్వర్లు, కుంట సహదేవ్, పరమ ఇమ్మానేయులు, శ్రీరామ్ హరీష్, నరెడ్ల బిక్షం, నరెడ్ల శివ, గుంతోజు శివ, నరెడ్ల రాంబాబు, సిపిఐ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ములకలపల్లిలో ఎన్నికల వేడి

**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలో పంచాయితీ ఎన్నికల వేడి మొదలైంది. ములకలపల్లి మండలంలో మొత్తంగా 20 గ్రామ పంచాయితీలు ఉండగా అందులో చాపరాలపల్లి గ్రామ పంచాయితీకి ఎన్నికలకు నిలుదల చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులను హైకోర్టు ఆదేశాల మేరకు జారీ చేశారు. కాగా ములకలపల్లి మండలంలోని 19 గ్రామ పంచాయితీలకు మాత్రమే ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ 19 గ్రామ పంచాయితీలకు గాను 115 మంది సర్పంచ్ అభ్యర్థులుగా తమ నామినేషన్లను వేశారు. కాగా అందులో 46 మంది సర్పంచ్ అభ్యర్థులు తమ నామినేషన్‌లను విత్‌డ్రా చేసుకున్నారు. అయితే మండలంలోని పొగళ్లపల్లి గ్రామ పంచాయితీ సర్పంచ్, వార్డులు ఏకగ్రీవంగా అయ్యాయి. ఈ క్రమంలో 18 గ్రామ పంచాయితీలకు గాను 68 మంది సర్పంచ్ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు. అదే విధంగా 19 గ్రామ పంచాయితీలకు గాను 178 వార్డులకు గాను 467 మంది వార్డు అభ్యర్థులుగా నామినేషన్ వేశారు. అయితే అందులో 65 మంది వార్డు సభ్యులుగా విత్‌డ్రా చేసుకొనగా, మరో 34 వార్డులు ఏకగ్రీవంగా అయ్యాయి. కాగా 368 మంది వార్డు అభ్యర్థులుగా పోటీలో ఉన్నారని ఎంపీడీవో రామారావు తెలిపారు.

## సిపిఎం బలపరిచిన అభ్యర్థులను ఆదరించండి



**ప్రజాపక్షం/ఇల్లందు:** గ్రామ పంచాయితీలో సుపరిపాలన అందించడం కోసం గ్రామాలను అభివృద్ధి చేసి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయాలనీ ధృడ సంకల్పంతో ఇల్లందు మండలంలో సిపిఎం బలపర్చిన అభ్యర్థులు ప్రజల ముందుకు ఎన్నికల్లో పోటీకి వస్తున్నారని, వారిని ప్రజలు ఆశీర్వదించి ఆదరించాలని సిపిఎం ఇల్లందు మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ పిలుపునిచ్చారు. ఇల్లందు సిపిఎం కార్యాలయం ఏలూరి లక్ష్మి నారాయణ భవన్‌లో నామినేషన్ వేసిన సర్పంచ్, వార్డు మెంబర్ల అభ్యర్థులతో పాటు పార్టీ మండల కమిటీ సభ్యుల, శాఖ కార్యదర్శుల సంయుక్త సమావేశం తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లందు మండలంలో 10 గ్రామ పంచాయితీ పరిధిలో సిపిఎం పార్టీ తరుపున సర్పంచ్, వార్డు మెంబర్లుగా నామినేషన్ వేయడం జరిగిందని, దానిలో భాగంగా సుభాష్‌నగర్ గ్రామ పంచాయితీలో బిఆర్ఎస్‌తో కుదుర్చుకున్న అవగాహనలో భాగంగా 3వ వార్డు అభ్యర్థిని కొమరం సరోజను ఏకగ్రీవంగా ఎన్నిక చేసుకోవడం జరిగిందన్నారు. ఈసందర్భంగా మాజీ ఎంఎల్‌ఏ హరిప్రియ నాయక్, మండల అధ్యక్షులు శీలం రమేష్‌లకు పార్టీ తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. మిగతా పంచాయితీలో బిజెపి తప్ప కలిసోచ్చే పార్టీలను కలుపుకొని వెళ్తామని పేర్కొన్నారు. ఈసమావేశంలో సిపిఎం మండల నాయకులు తాళ్లూరి కృష్ణ, మన్నెం మోహన్‌రావు, బయ్యా అభిమన్యు, ఎండీ అబ్బాస్, వజ్జా సురేష్, బైమున్నిసా, సోమ సుజాత, సోమ కృష్ణ, విజయ్ మోహన్‌సింగ్, ఆరెబిజె రాజు, ముడిగే రాములు, ముడిగే కృష్ణ కుమారి, దనసరి వసంత, కంగాల కనకమహాలక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ హయాంలోనే పల్లెల అభివృద్ధి

**-బిఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించండి**
**-ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి పువ్వాడ**





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లెల్లో అభివృద్ధి జరిగిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఆదివారం మండల పరిధిలోని కోటపాడు, కోయచలక గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలో పదేళ్ల కాలంలో గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెట్టిందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసినట్లు తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి త్రాగు నీటిని అందించినట్లు తెలిపారు. చెరువులను పునరుద్ధరించి భూ గర్భ జలాలను పెంచినట్లు తెలిపారు. పింఛన్లను పెంచిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల కాలంలోనే అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. మరల వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. కోటపాడు, కోయచలక గ్రామాల్లో బిఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుత్తా రవి, మాధంశెట్టి హరిప్రసాద్, కొంటెముక్కుల వెంకటేశ్వర్లు, వడ్డే ప్రసాద్, చెరుకూరి భిక్షమయ్య, వెంకటేశ్వర్లు, శివయ్య, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజ మార్పుకు మార్క్సిజమే మార్గమని నమ్మిన వాడు జోసెఫ్

**-సంస్మరణ సభలో తమ్మినేని**



**ప్రజాపక్షం/ఖమ్మం :** అనేక రుగ్మతలతో కూడిన ప్రస్తుత దోపిడీ సమాజ మార్పుకు మార్క్సిజమే మార్గమని నమ్మిన వాడు కా॥ ఇనుపనూరి జోసెఫ్ అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఆదివారం మంచికంటి భవన్‌లో బివికె జనరల్ మేనేజర్ వై. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఇనపనూరి జోసెఫ్ సంస్మరణ సభలో తమ్మినేని వీరభద్రం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జోసెఫ్ మార్క్సిస్టు సైద్ధాంతిక విషయాలను అధ్యయనం చేయడంలో వాటిని నిత్య జీవిత కార్యచరణకు అన్వయించడంలో తగిన క్రమశిక్షణ పాటించేవారని ఆయన తెలిపారు. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైనప్పటికీ ఒక మంచి మార్క్సిస్టు ప్రచారకుడిగా కృషి చేశారని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి నుండి రిటైర్ అయిన తర్వాత అనేక సామాజిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. బోడేపూడి విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ సభ్యులుగా, ఆదివారం మీ కోసం కమిటీ నిర్వాహకులుగా, స్టడీ సర్కిల్ సభ్యులుగా అనేక రూపాల్లో సేవలు అందించారన్నారు. మార్క్సిజం, లెనినిజం, సైద్ధాంతిక విషయాలను కొత్త తరానికి అందించడం కోసం తపనపడే వారన్నారు. ఈ సందర్భంగా జోసెఫ్‌కు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు,రాష్ట్ర నాయకులు సోమయ్య, మాచర్ల భారతి,బుగ్గవీటి సరళ, జిల్లా నాయకులు మాదినేని రమేష్, మెరుగు సత్యనారాయణ, బండి పద్మ, బండారు రమేష్, నందిపాటి మనోహర్, ఎస్‌కె మీరా, నర్సయ్య, ఆర్. ప్రకాష్, హిమబిందు, అఫ్జల్, జోసెఫ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గామాల్లో అభివృద్ధి కోసం కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు తుమ్మల యుగంధర్ పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీ ఎ న్నికల్లో భాగంగా ఆదివారం రఘునాథపాలెం మండలంలోని కెవి బంజర, మూలగూడెం, రజబ్అలీ నగర్, ఎన్‌వి బంజర, పంగిడి, పాపటపల్లి, జికె బంజర, విఆర్ బంజర, చిమ్మపుడి, కోటపాడు, కోయచలక గ్రామాల్లో కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిందని తెలిపారు. సుస్థిర పాలనకు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, బోయనపల్లి లక్ష్మణ్ గౌడ్, ఊయ్యూరు వెంకటనారాయణ, బాతుల సుధాకర్, చెరుకూరి పూర్ణచందర్‌రావు, మాధంశెట్టి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

# బాలోత్సవాన్ని జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నగరంలో డిసెంబర్ 10, 11, 12 తేదీలో మంచికంటి హాల్‌లో బాలోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలోత్సవ్ కన్వీనర్ వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ బోడేపూడి విజ్ఞాన కేంద్రం, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, జన విజ్ఞాన వేదిక, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్, ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఖమ్మంలో బాలోత్సవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను, ఆలోచనలను పెంపొందించడానికి ఈ బాలోత్సవ్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులకు వివిధ అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, నృత్యం, సంగీతం, పాటల పోటీలు, స్పెల్‌బి, ఫ్యాన్సీ డ్రెస్, బెస్ట్ ఫ్రం వెస్ట్, స్టోరీ టెల్లింగ్ వంటి పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు 12వ తేదీన బహుమతులను జిల్లా విద్యాశాఖాధికారి చైతన్య జైని, జిల్లా సంక్షేమ అధికారి వెల్పుల విజేత, టిపిఎస్‌కె రాష్ట్ర కార్యదర్శి కానూరి హిమబిందు చేతుల మీదుగా అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో బివికె, టిపిఎస్‌కె, జెవివి, పెన్షనర్స్ అసోసియేషన్, ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల జిల్లా బాధ్యులు సామినేని నాగేశ్వరరావు, ఏడునూతల రవి, ఎన్. గోవిందరావు, వాసిరెడ్డి వీరభద్రం, మోహన్, విప్లవ్‌కుమార్, శ్రీదేవి, మల్లిక, తిరుమలాచార్యులు, వసుంధర, స్వామి, సీత, రామారావు, అరుణ, కళ్యాణం నాగేశ్వరరావు, ఎం. సుబ్బారావు పాల్గొన్నారు.

# ట్రస్మా వైరా డివిజన్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

**-అధ్యక్ష, కార్యదర్శులుగా బి.కిరణ్, టికె.ప్రసన్నన్**





**ప్రజాపక్షం/ తల్లాడ :** ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యసంఘం (టస్మా) సర్వసభ్య సమావేశం నాగులవంచ శ్రీ ఆదర్శ హైస్కూల్ ఆవరణంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్మ జిల్లా అధ్యక్షులు గుర్రం కాంతారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రైవేట్ పాఠశాలలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ప్రాథమిక పాఠశాలల రెన్యువల్ గుర్తింపు కూడా 10 సంవత్సరాలకు పెంచాలన్నారు. ప్రైవట్ పాఠశాలల ఎదుర్కొంటున్న పలు సమస్యలను జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారి జిల్లా రవాణశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన చెప్పారు. ఈసమావేశానికి చింతకాని బోనకల్, వైరా, కొణిజర్ల, తల్లాడ ఏన్కూరు మండలాలకు చెందిన ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు హాజరయ్యారు. ఈసందర్భంగా వైరా డివిజన్ ట్రస్మా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ట్రస్మా డివిజన్ అధ్యక్షునిగా నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయానికి చెందిన బోడేపూడి కిరణ్, ప్రధాన కార్యదర్శి తల్లాడ యూనివర్సిల్ విద్యాలయానికి చెందిన టికె.ప్రసన్నన్, ట్రెజరర్‌గా జె.నర్సింహారావు, జాయింట్ సెక్రటరీగా మారిమ్మ క్యూలేట్, కరస్పాండెంట్ యమునా దాస్, గౌరవాధ్యక్షునిగా పల్లిపాడుకు చెంది ఎన్.మాధవారెడ్డి, ఉపాధ్యక్షునిగా ఏన్కూరు సాయి విద్యానికేత్‌కు చెందిన ఇంద్రారెడ్డి, ఇసి మెంబర్‌గా వీరపనేని మల్లికార్జునలను ఎన్నుకున్నారు. ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని నూతన సభ్యులు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ట్రస్మా జిల్లా బాధ్యులు సంక్రాంతి రవికుమార్, కొట్టగిరి ప్రవీణ్, పోతినేని భూమేష్, ఠాగూర్ విద్యాలయం కరస్పాండెంట్ రవి, ఉమాశంకర్, ఉమా, మల్లెంపాటి రంజిత్, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

# ప్రార్థనా మందిరంలో రఘుపతిరెడ్డి ప్రచారం



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దగ్గుల రఘుపతిరెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రచారంలో భాగంగా స్థానిక సృష్టికర్త ఏసు క్రీస్తు రాజసువార్త మినిస్ట్రీ మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు ఆదివారం నిర్వహించి ప్రచారం చేశారు. ఈసందర్భంగా పాస్టర్‌లు పరంజ్యోతి అజయ్ బాబు కన్నబాబు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వదించారు. అనంతరం రఘుపతిరెడ్డి మాట్లాడుతూ డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మంత్రులు, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ నాయకత్వంలో 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ , సబ్సిడీ గ్యాస్ రూ.500, మహిళలకు ఉచిత బస్సు, రేషన్‌కార్డుల, సన్న బియ్యం లాంటి మరెన్నో సంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతుందని, అదే విధంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. తల్లాడ కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు అమూల్యమైన ఓటు వేసి అధిక మెజార్టీ గెలిపించాలని రఘుపతిరెడ్డి కోరారు.

# మండలంలో బోణి కొట్టిన బిజెపి పార్టీ

**-బెండాలపాడు గ్రామ పంచాయితీలో ఏడవ వార్డు ఏకగ్రీవం**



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండల పరిధిలోని బెండాలపాడు గ్రామ పంచాయితీలోని ఏడవ వార్డు బిజెపి అభ్యర్థి తేజవత్ బాబు(బాలు)ఏకగ్రీవంగా ఎన్నికైన్నాడు. దీంతో మండలంలో బిజెపి పార్టీ మొట్ట మొదటి వార్డును ఏకగ్రీవంగా ఎన్నికైంది. దీంతో బిజెపి వర్గాలు సంబురాలు చేసుకున్నారు. ఈసందర్భంగా తేజావత్ బాబు మాట్లాడతూ నన్ను బెండాలపాడు గ్రామ పంచాయితీలోని ఏడవ వార్డు బిజెపి అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు , వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# రావికంపాడులో విచిత్ర పొత్తు



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** గ్రామ పంచాయితీ ఎన్నిక వేళ మండలంలోని రావికంపాడు గ్రామ పంచాయితీలో విచిత్ర పోత్తులకు దారితీసింది. మండలంలోని రావికంపాడులో పొన్నెబోయిన బిక్షమయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ నాయకుడు భూపతి రమేష్ ఆధ్వర్యంలో బలపరిచిన పొట్టు బానోతు రమణ, అదే అభ్యర్థికి టిడిపి కూడా బలపరచడం జరిగింది. ఆదివారం ప్రారంభించారు. పాత కాంగ్రెస్ కొత్త కాంగ్రెస్ అని రెండు వర్గాలుగా మారి వారు బలపరిచిన అభ్యర్థులను నిలపటం విశేషం. మరో కాంగ్రెస్ పార్టీ బోయిన బోగి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బలపరిచిన భూక్య సరిత బరిలో నిలవగా మండల పరిధిలోని రావికంపాడులో పోటీ రసవత్తరంగా మారింది.